
# ఇరుసు

సౌపిలి



పదేళ్ల క్రితం కువైట్‌కి పొట్ట చేత్తో పట్టుకుపోయి మళ్లీ ఇదే నేను మా ఊరికి రావడం.

జనం క్రిక్కిరిసిన బస్సులో ఒదిగి కూర్చుని, చేన్లూ, పల్లెలూ దాటి నన్ను పెంచి పెద్ద చేసిన నా ఊరికి వస్తుంటే గుండెలో ఏదో అనిర్వచనీయమైన భావోద్వేగం. అస్తిమితం. చేతులు నలుపుకుంటూ కూర్చున్నాను - బస్సు కిటికీలోంచి చూస్తూ. శాంతా క్రజ్‌లో అడుగు మోపినప్పుడు కూడా నేను ఇంత 'టెన్షన్' కు గురి కాలేదు.

నా ఊరిలోని పరిచయస్థులూ, స్నేహితులూ, ఆ వీధులూ, హోటళ్లూ, సినిమా హాళ్లూ, ఆ కాలేజీ మైదానంలో ఉదయపు వ్యాయామాలూ, సాయంత్రపు ఆటలూ, రాత్రి రూములో కరెంటు దీపం ఆర్పుకుని గొద్గదికమైన గొంతుల్తో పాడుకున్న పాటలూ, ఆ పాటల్ని తమ అభౌతిక హస్తాలతో వెలిగించిన ప్రియురాళ్లూ... ఎప్పుడో పదేళ్ల క్రితం వదిలేసిపోయిన అనుభవాల బోగీని మళ్లీ ఈ రోజు గుండెలకు హత్తుకుని లాక్కుపోతున్నాను - నా జ్ఞాపకాల్లో.

బస్సు కిటికీలోంచీ చూస్తూ చూస్తూ చప్పున నిటారైపోయాను. దూరంగా కొండ! మా ఊరికొండ! ఎత్తైన వాలు చేనుల వెనకల నుంచీ కొంచెం కొంచెం తలెత్తి నా వైపే నిక్కి నిక్కి చూస్తోంది.

ఆ కొండ అంటే నాకు చాలా ఇష్టం. ఎంత ఇష్టమంటే ... నేను బి.కామ్. చదివేటప్పుడు నేను తనకు రాసిన ప్రేమ లేఖని నా క్లాసుమేటు జలజ మా ప్రిన్సిపాల్ చేతిలో పెట్టేటప్పుడు, ఆ అవమానం భరించలేక ఆ కొండపై నుంచే దూకి చచ్చిపోదా మనుకున్నాను.

నా ఇరవై రెండేళ్లప్పుడు ... అంటే నేను కువైట్‌కి పోవడానికి సంవత్సరం ముందు అన్నమాట! కూలీ నాలీ చేసి నన్ను డిగ్రీ చదివించిన అమ్మ సరైన తిండిలేక క్షయ వ్యాధితో చచ్చిపోయినప్పుడు కూడా అదే కొండ మీది నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవా లనుకున్నాను. అంత ఇష్టం నాకు ఆ కొండ అంటే! అంత ప్రాణం నాకు ఆ కొండ అంటే! కొండ నా ఆత్మ!!

కొండ కిందే మా ఊరు. ఊరి చుట్టూ కోట గోడ విస్తరించి కొండ శిఖరం పైకి పోతోంది. గోడలోంచీ పెద్ద పెద్ద రాళ్లు ఊడిపడి అక్కడక్కడా శిథిలమైంది. కానీ కోట గుమ్మం ఇప్పటికీ ఎత్తుగా, విశాలంగా నిలబడి ఏ గతించిన కాలంలోనికో నన్ను ఆహ్వానిస్తూనే ఉంది.

ఈ పదేళ్లలో మా ఊరు చాలా మారిపోయింది. కోట వైపు బజారు వీథి చాలా పెరిగిపోయింది. మరో కొత్త సినిమా హాలూ, టెంటూ వచ్చాయి. హోటళ్లూ, అంగళ్లూ పెరిగాయి. బజారుకు అనుకునుండే ఇళ్లన్నింటినీ ఖాళీ చేసి షాపింగ్ కాంప్లెక్సులుగా మార్చారు. మా ఊరి పరిసరాల్లో వచ్చిన ఈ భౌతిక మార్పులు నన్నెందుకో సంతోష పెట్టలేకపోయాయి.

"ఇక్కడ మేము కోతికొమ్మచ్చి ఆడిన ఒక వేప చెట్టు ఉండాలి కదా? ఇక్కడ మేము షటిల్ కాక్ ఆడుకున్న చిన్న మైదానం ఉండాలి కదా?" అని గుర్తు చేసుకుంటూ నడుస్తున్నాను.

కోట గుమ్మం దాటాను.

గోళీ గుండ్లకూ, బొంగరాలకూ మా వీథిలో కాలం

చెల్లినట్లుంది. ఇండ్ల గోడల మీద వికెట్లను బొగ్గుతో గీసి, చెక్క బ్యాటూ, రబ్బరు బాలుతో క్రికెట్ ఆడుతున్నారు చిన్న పిల్లలు. 'పదేళ్ల క్రితం నేను ఇక్కడ ఉన్నప్పుడు ఈ పిల్లలు ఎవరూ ఇంకా పుట్టి కూడా ఉండరు కదా' అనుకుంటే ఎందుకో చిత్రమనిపించింది.

కోట లోపల పాత గుళ్లూ, ముసలి మర్రి చెట్లూ, దిగుడు బావులూ అన్నీ అట్లే ఉన్నాయి. వాటిని చూస్తుంటే నాకు నా చిన్నప్పటి ఫోటోల్లో అమ్మ చంకలోకి ఎత్తుకున్న నన్ను చూస్తున్నట్లే ఉంది. నా పెదవుల పైకి మెల్లగా ఒక నవ్వు తోసుకొచ్చింది.

కోదండ రామస్వామి గుడికి సరిగ్గా ఎదురుగా పెద్ద చింత చెట్టుకు ఆనుకుని ఉండేదే కృష్ణమూర్తి ఇల్లు. కృష్ణమూర్తి కవిత్వం రాస్తాడు. రాత్రులు వాళ్ల అరుగు మీదే పడుకుని, నిటారుగా నిలబడిన కొండ మీద మినుకు మినుకుమనే నక్షత్రాల రహస్యాల్లోకి చూస్తూ నిద్రపోయేవాళ్లం. పొద్దున్నే కృష్ణమూర్తి అవ్వ చీపురు పట్టుకుని బకెట్లూ, పేడ నీళ్లూ సిద్ధం చేసుకుని - "రేయ్ ఇక లేవండ్రా ఇద్దర్నూ" అని లేవగొట్టేటప్పటికి మసీదు మొకులో "అల్లా హెూ అక్బర్" అంటూ హుస్సేను వాళ్ల నాయన గొంతు అద్భుతంగా వినిపిస్తుండేది.

కృష్ణమూర్తి ఇంట్లో - బ్రతికి ఉండగా కోల్పోయిన బొట్టుని తిరిగి సంపాదించుకున్న అవ్వ ఫోటో!

అందమూ, ఆప్యాయతా కలబోసినట్లున్న కృష్ణమూర్తి భార్యను చూశాక వాడు ఎంత అదృష్టవంతుడో, ఎంత గొప్ప కవిత్వం రాసి ఉంటాడో అని ఊహించుకున్నాను. మేము టిఫిన్ చేయడం పూర్తి అయ్యాక, కృష్ణమూర్తి తన హీరో హెూండా బండిని బయటికి తీసి స్టార్ట్ చేశాడు.

"ఏరా కృష్ణమూర్తీ! పదేళ్లు గడిచిపోయాయి కదా! ఇప్పుడు ఏం కవిత్వం రాస్తున్నావ్?" అని అడిగాను.


కానీ వాడు మాత్రం - 'కవిత్వమా?' అంటూ ఆశ్చర్యపోయాడు. ఏదో చెప్పబోతూ - 'ఒక్క నిమిషం' అంటూ బండి ఆపాడు. 'హలో' అంటూ ఎదురుపడిన మనిషికి విష్ చేశాడు - 'మిమ్మల్ని హఠాత్తుగా ఒక లారీ గుద్దేస్తే ఎట్లా? మీ భార్యా బిడ్డల సంగతి ఎట్లా? యాక్సిడెంటల్ డెత్ అయితే ఇంత, నేచురల్ డెత్ అయితే ఇంత'

అని కృష్ణమూర్తి ఆ శాల్తీ మీద తన ఎల్. ఐ. సి. రెడీమేడ్ మాటల్ని వడగళ్ల వర్షంలా కురిపిస్తుంటే అసహనంగా తలెత్తి చూశాను. కొండ చరియల కింద రెక్కలు విచ్చుకత్తుల్లా చాపుకుని తన ఆహారాన్ని వేటాడుకుంటున్న గద్ద!

ఇద్దరం హెూటల్లోకి పోయి మరోసారి టీ తాగి సిగరెట్లు వెలిగించాము. మా సంభాషణలలో కృష్ణమూర్తి అడపా దడపా బూతులు దొర్లించడం గమనించాను.

**అతని హృదయంలో ఇప్పుడు మునుపటి ఆర్ద్రత లేదు. మాటల్లో లౌక్యం! ముఖంలో ఏదో యావతో కూడిన కర్కశత్వం!**

తన ఇంటిలోని ఒక కుటుంబ సభ్యుని గురించి మాట్లాడుతున్నంత ఆత్మీయంగా కృష్ణమూర్తి తన హీరో హెూండా బండి గురించి మైమరచి



మాట్లాడుతుంటే వాని ముఖంలోనికే చూస్తూ కూర్చున్నాను.

"చలం 'పురూరవ' చదివి వాక్యం వాక్యం కిందా గీతలు గీసుకుని పలవరించిన కృష్ణమూర్తి! కృష్ణశాస్త్రి భావ గీతాల్ని తడికళ్ళతో ఆలపించిన కృష్ణమూర్తీ! చెట్లలో, పుట్టలో, పువ్వుల్లో, పక్షుల్లో అందాన్ని ఆరాధించిన వాడా! ఏకాంతాన్ని మీటుతూ సౌందర్యాన్ని సాధన చేసిన వాడా? ప్రేయసీ ప్రియుల కలిసిన పెదవుల్లో మౌనాన్ని వినగలిగిన కవీ! కృష్ణమూర్తీ! మేరా యార్! ఎక్కడ్రా నువ్వూ? నువ్వు నీ ముఖంలోనే కనిపించడంలేదే!" అంటూ నిరాశగా మూలుగుతున్నాను.

"నువ్వు మన వాళ్లందరినీ పలకరించిరా. ఈలోగా నేను బ్రాహ్మణపల్లికి పోయి ఒక డిఫాల్టర్‌గాన్ని పట్టుకుని చూసుకుని వస్తాను. మధ్యాహ్నం మన ఇంట్లోనే భోజనం" అని చెప్పి వెళ్లాడు. నేను "సరే" అని హుస్సేన్ ఇంటి వైపు కదిలాడు.

హుస్సేన్ ఇంట్లో లేడు. హుస్సేన్ తండ్రి



## క్షణాల్లో చంపే తేళ్లు ! ! ?

సర్వసాధారణంగా తేళ్లన్నీ విషపూరితాలే అయినప్పటికీ వాటి విషం వల్ల మనిషికి ప్రాణహాని జరగదు. అయితే తేళ్లన్నింటిలోనూ అతి పెద్దవైన నార్త్ అమెరికన్ జాతి తేళ్లు మిగతా వా టన్నిటికన్నా విషపూరితమైనవి, అత్యంత ప్రమాదభరితమైనవి. అవి క్షణాల్లో విషాన్ని విడుదల చేస్తాయి. వీటి విషం వల్ల మనిషికి నాలుగు గంటలలో, కుక్కకు ఏడు నిముషాల్లో, కోడికి అర నిముషంలో మృత్యువు లభిస్తుంది. ప్రపంచంలో కెల్లా అతి ప్రమాదభరితమైన తేలుగా దీన్ని అభివర్ణించారు. ప్రపంచంలో మొత్తం ఎనభై శాతం తేలు కాటు వల్ల బాధపడుతున్నారు. అలాగే ఈ తేలు కాటు తిన్నవారిలో తొంభై శాతం మృత్యువాతకు గురవుతున్నారు. 1938 సెప్టెంబర్ నెలలో ఒక్క నెల రోజుల్లోనే 72 మంది ఈ తేళ్ల కాటుకు గురై మరణించారు. ఈ సంఘటన ఈజిప్టు రాజధాని అయిన కైరోలో జరిగింది. అలాగే పాకిస్తాన్‌లోని ఒక గెస్ట్ హౌస్‌లో నిద్రిస్తున్న ఎనిమిదిమంది వ్యక్తులు ఈ జాతికి చెందిన ఒకే ఒక్క తేలు కాటుకు గురయ్యారు.

ఈ తేలు కుట్టగానే నరాలు ఉబ్బి విషంతో నిండిపోతాయి.

శ్రీ శారద [వాడ్రేవుపల్లి]

## దేశ భక్తుడు బిర్సా

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులను దేశం వదిలిపోయేటట్లు చేయడానికి ఎంతోమంది మహనీయులు ఎన్నో త్యాగాలు చేసి, చివరికి స్వాతంత్ర్యాన్ని సాధించారు. అయితే దేశంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎటువంటి ఉద్యమం తల ఎత్తక ముందే ఛోటా నాగపూర్‌లో బిర్సాముండా అనే ఆదివాసి దేశభక్తుడు. శ్వేత జాతీయులపై ప్రతిఘటన ఆరంభించాడు. ఆ సందర్భంలోనే అతణ్ణి చెరసాలలో వేశారు. 1900లో రాంచీ జైల్లోనే బిర్సా యోధుడు మరణించాడు. ఇటీవల ఆయన త్యాగానికి చిహ్నంగా రూర్కెలాలో పదహారు అడుగుల బిర్సా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఒరిస్సాలోని విగ్రహా లన్నింటిలో ఇదే పెద్దది.

హిమజా రమణ [తెనాలి]

ముందు గదిలో మంచం మీద పడుకుని ఉన్నాడు. పోయి పలకరిస్తే గుర్తుపట్టి సంభ్రమంగా చూశాడు. పక్కన కూర్చోబెట్టుకున్నాడు. మాట పడిపోయింది 'మాట్లాడలేను' అన్నట్టు నోటి దగ్గర చెయ్యి పెట్టుకుని అడ్డంగా తిప్పాడు. ఎడం కాలూ, ఎడం చేయీ అతని స్వాధీనంలో లేవు. పక్షవాతం! మసీదు మైకులో అతని గొంతు ఎంత గొప్పగా వినిపించేదో నేను వర్ణిస్తుంటే అతని కళ్లల్లో ఆ జ్ఞాపకం తాలూకు కన్నీళ్లు.

హుస్సేన్ ఇంటి నుంచీ వచ్చేస్తుంటే - ఒకప్పుడు మేము ఉన్న ఇంటిని చూడాలని తీవ్రంగా అనిపించింది.

చూరు నుంచీ మన్ను రాలే ఒక పాత ఇరుకు ఇల్లే కావచ్చు అది. కానీ ఎంత గొప్ప ఇల్లు! ఇంటి ఎదురుగా ఋషీశ్వరుడిలాంటి ఒక రావి చెట్టూ, ఆ పక్కనే పాడుబడిన కోనేరూ, ఎదురుగా ఆపాదమస్తకం కనిపించే ఊరి కొండా, పగలంతా చెట్ల మీదా, ఇళ్ల కప్పుల మీదా గడిపి పొద్దు మునగగానే నిద్రకు కొండలోకి వెళ్లిపోయే కోతుల గుంపూ, ఇంటి పక్కనే మంచినీటి బావి, గిలక చప్పుడూ... అన్నీ ఎంత అద్భుతంగా ఉండేవి!

తీరా పోయి చూస్తే అక్కడేముంది? మా ఇంటి కప్పు కూలిన మొండి గోడలు. మొండి గోడల మధ్య రాళ్ల కుప్పలు. నేనూ, నా తండ్రీ, నా తాత అందరం ఈ ఇంట్లోనే పుట్టాము. నేను చూస్తుండగా మా అమ్మ ఈ ఇంట్లోనే చచ్చిపోయింది. మొండి గోడల మధ్యకు పోయి నిలబడ్డాను. ఆ మూల ఇంకా వంట చేస్తున్నట్లే కనిపిస్తోంది మా అమ్మ. ఒక 'అశాశ్వత సత్యం' లాంటి ఆ శిథిలాల మధ్య ఏదో గూఢమైన విషాదం కమ్ముకుని నా హృదయాన్ని కుదిపివేసింది.

హుస్సేన్ మార్కెట్లో కనిపించాడు.

నేను వెళ్లేటప్పటికి గొర్రెని కిందపడేసి దాని కాళ్లను తన కాళ్ల క్రింద తొక్కిపట్టి దాని గొంతులోకి చివరి నీళ్లు పోసి 'బిస్మిల్లా' చేస్తూ కనిపించాడు.

వెనక నుంచీ పోయి నా కంటే పొట్టిగా ఉన్న హుస్సేన్ భుజాల్ని కౌగిలించుకున్నాను. తిరిగి ఆశ్చర్యపడి - "ఒరేయ్! సత్తీ! నువ్వా!" అంటూ అరిచాడు హర్షాతిరేకంతో.

ఇద్దరం అట్లే ఒకర్నొకరు పొదువుకొని బైటికొచ్చి



టీ తాగాము మాట్లాడుకుంటూ - సిగరెట్ ఇస్తే - "అదెందుకురా? కాగితం చుట్టుకుని తాగినట్టుంటుంది. నాకు సరిపోదు" అంటూ బీడీ తీసి వెలిగించాడు.

"వెన్నెల్లో తెగిన కోడి మెడ" అని పేరు పెట్టి పిలుచుకునే ఒకనాటి అనుభవం గుర్తుకు రాగానే నాకు నవ్వొచ్చింది. "మొత్తానికి నువ్వు సరైన పనిలోనే ఇరుక్కున్నావురా హుస్సేన్" అన్నాను.

"ఏమిరా! ఈ పనికేమయింది" అన్నాడు అమాయకంగా.

"శర్మగారు మాంసం తినే పక్షంలో నేను బిస్మిల్లా చెయ్యకుండానే కోడిని తింటానని పోటీపడ్డావు కదరా ఆ రోజు కొండ మీద!" అని వానికి ఆ పాత కథంతా గుర్తు చెయ్యగానే వాని ముఖంలో సంతోషానికి మారుగా భయం కదులాడింది.

దగ్గరగా జరిగి - "ఆ సంగతి గట్టిగా మాట్లాడవద్దురా సత్తీ! గోడలకు చెవులుంటాయి. నాకు ఈ పని తప్ప మరొక జీవనాధారం లేదు. అయిదుగురు ఆడ పిల్లల తండ్రిని. వాళ్లకు పెండ్లి పేరంటాలు జరపవలసిన వాన్ని. నా నోట్లో దుమ్ము కొట్టకురా సామీ!" అంటూ వేడుకున్నాడు. ఆ విషయాన్ని వాడు అంత సీరియస్‌గా పట్టించుకుని భయపడడం నన్ను తీవ్రంగా కదిలించివేసింది.

కొండ మీద చీకటి గుహలోకి ఒక్కడే వెళ్లొచ్చిన సాహసవంతుడు హుస్సేన్. నా మీదికి ఎవరైనా వస్తే షర్టు గుండీలు విప్పి నాకు అండగా నిలబడిన కలేజా మనిషి హుస్సేన్. ఇప్పుడు లోకపు మర్యాదలకు తల ఒగ్గే ఒక ఆడ పిల్లల తండ్రి. నలుగురితో పాటు నారాయణా అంటూ జీవించే ఒక సగటు మనిషి.

"అయ్యో! హుస్సేన్! పులిమాదిరి ఉండేవాడివి. ఈ సంసార జంజాటాలు నిన్ను పిల్లిలా మార్చివేశాయి కదురా!" అని సానుభూతితో కదిలిపోయాను. "శర్మ ఇంటిదాకా పోయి వస్తాం రారా" అని అడిగితే - "నేను రానులే! నువ్వు పోయిరా! మళ్లీ కలుసుకుందాం!" అన్నాడు.

శర్మ కుటుంబం అంటే నాకు చిన్నప్పటి నుంచీ ఆరాధన. ఆ ఇంట్లో శర్మ అక్కయ్యలూ, అన్నయ్యలూ అంతా ఎప్పుడూ ఎంతో సరదాగా ఉండేవాళ్లు. ఇంటిల్లిపాదీ కారమ్స్ ఆడేవాళ్లు. చదరంగం ఆడేవాళ్లు. పండగ పూట రమ్మీ ఆడేవాళ్లు. తమ క్లాస్‌మేట్స్ గురించీ, టీచర్ల గురించీ బాతాఖానీ వేసేవాళ్లు. రాయ్ సినిమాలకూ, సంగీత కచేరీలకూ తప్పనిసరిగా వెళ్లేవాళ్లు. పుస్తకాలు చదివేవాళ్లు. చర్చించేవాళ్లు. వాళ్లందరికీ రకరకాల స్వీట్లు చేసిపెట్టి ఎంతో మురిసిపోతుండేది వాళ్ల తల్లి. లోకంలో ఉన్న సంతోషమంతా వాళ్లింట్లోనే విడిది చేసినట్లుండేది. ఆ కుటుంబ సభ్యుల మధ్య అన్యోన్యతని చూసి అబ్బురపడేవాణ్ణి.

భార్యను పిలుచుకురావడానికి శర్మ అత్తవారి ఊరు వెళ్లాడంట. పక్క ఊరిలోని హైస్కూలులో "మ్యాథ్స్ అసిస్టెంటు"గా పని చేస్తున్నాడు.

నా విషయాలన్నీ కనుక్కున్న తరువాత తన

కూతుర్ల గురించీ, కొడుకులూ, కోడళ్ల గురించీ బాధను వెళ్లబోసుకోవడం ప్రారంభించింది ఆ ముసలి తల్లి.

ఈ పదేళ్లలో ఆమె కొడుకులకూ, కూతుళ్లకూ అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. పిల్లలు పుట్టారు. ఎవరి సంసారాలు వాళ్లకు ఏర్పడ్డాయి. పాతికేండ్లు, ముప్పై ఏండ్లుగా తమ ఇంటి సభ్యులతో పెనవేసుకున్న అనుబంధాన్ని అనురాగాన్ని సడలించేసుకుని ఎవరి గూళ్లకు వారు వెళ్లిపోయారు. ఎవరి సంపాదన వాళ్లది. ఎవరి సంసారం వాళ్లది. అందరిదీ ఒకే కుటుంబం అన్న భావన చీలికలు, పేలికలు అయిపోయింది. ఇళ్ల కోసం, భూముల కోసం కీచులాడారు. 'మాకు అన్యాయం జరిగిపోయిందం'టూ గోలపెట్టారు.

ఇప్పుడు ఒకరు బాగా బతికితే మరొకరికి అసూయ. కొందరైతే అసలు కలుసుకోరు కలుసుకున్నా సరిగా మాట్లాడుకోరు. పండగలకో, పెద్దల అబ్దికాలకో కలుసుకున్నప్పుడు - ఆడవాళ్లైతే ఒకరి చీరలు ఒకరు చూసుకుని ముఖం మాడ్చుకుంటారు. మగవాళ్లైతే ఒకరి



నంపాదన ఒకరు తెలుసుకుని ఈర్ష్యపడతారు. వ్యంగ్యపు మాటలు వినురుకుంటూ విషాన్ని కక్కుకుంటారు.

మనుషులు మారిపోయారు. మనుషుల మధ్య నంబంధాలు మారిపోయాయి. అవసరాలూ, అత్యాశలూ మార్పును నిర్దేశిస్తున్నాయి. మనుషుల్ని కీలుబొమ్మలుగా ఆడిస్తున్నాయి.

ఆమె గోడంతా వింటుంటే జీవితం ఒక వేరు తెగిన మొక్కలాగా, తప్పించుకోలేని బీభత్సంగా, విషాదంగా అనిపించసాగింది.

క్రూరత్వం - మనుషుల్లో కంటే - ముందు అసలు జీవితంలోనే ఉందేమో అని మనసును ఎంత నరిపెట్టుకోజూసినా - "తప్పదా? ఇష్టమున్నా లేకపోయినా ఈ మార్పుల ప్రవాహంలో పడి మనిషి నిస్సహాయంగా కొట్టుకుపోక తప్పదా?" అన్న వేదన నా మనసును మెత్తగా కోసేస్తోంది.

"శర్మ రాగానే నేను వచ్చినట్టు చెప్పమ్మా" అని ఆ ఇంటి నుంచీ బైటపడ్డాను.

నేను మా ఊరు వచ్చి అప్పుడే పది రోజులు దాటింది. మిత్రుల్ని కలిసినందుకు నాకు చాలా నంతోషంగా ఉంది. ఉద్యోగాల్లో పడి దూర ప్రాంతాలకు వెళ్లిపోయిన కొంత మందిని మాత్రం కలవలేకపోయాను.

నా మిత్రులు ఒకరికొకరు పెట్టుకున్న కొత్త 'నిక్ నేముల్ని' వింటూ ఉల్లానంగా ఉన్నాను. కానీ కొన్నిసార్లు వాళ్లు వగలపడి నవ్వే జోకు ఏ నందర్భంలో ఎట్లా పుట్టిందో వాళ్లు చెబితే తప్ప ఆ జోకు అర్థమై నాకు నవ్వు వచ్చేది కాదు. వాళ్లు - ఒకరు చెప్పదలచుకున్న భావాన్ని ఒకరు అలా అలా పసిగట్టి అందుకుపోతుంటే నేను ఎంతో వెనకబడిపోయినట్లుగా అనిపించేది. వాళ్ల భౌతిక, మానసిక వాతావరణంతో నాకు పదేళ్ల వియోగం కదా!

జనవరి ఫస్ట్ రాబోతోంది. ముప్పయ్ ఒకటి రాత్రి మిత్రులంతా కలిసి ఒక పార్టీ



చిత్రం: చిట్ల చంద్రశేఖర

పెట్టుకున్నాము - హొటల్‌లో రూమ్ తీసుకుని.

ఒకటో రౌండ్ పూర్తయింది. రెండో రౌండ్‌లో వడ్డాం.

మత్తు! మూలాననంలో వెచ్చగా మొదలై ఒళ్లంతా విద్యుత్తుగా వ్యాపించి నా అస్తిత్వ స్పృహను విశాలపరుస్తున్న మత్తు!

మూడో రౌండ్‌లో వడ్డాం.

కృష్ణమూర్తి, శర్మా - హుస్సేనూ, నేనూ మా అందరి మధ్యా వ్యక్తి భేదాలు నశించిపోయి, అందరం కలిసి ఒకే చైతన్యపు దుప్పటిని కప్పుకున్నట్లు ఏవో ఆత్మీయతను అనుభవిస్తున్నాను మౌనంగా! ఆ ప్రస్తుతానుభవంలో హఠాత్తుగా ఒక అపశ్రుతి.

మిత్రుల చర్చల్లోకి అయోధ్య నమస్య వచ్చింది. మండల్ కమిషన్ వచ్చింది. వాళ్ల మధ్య వెంటనే గోడలు మొలుచుకొచ్చాయి.

విద్యాగంధం లేని వాళ్లకే కుల మతాల పట్టింపులు ఎక్కువగా ఉండేవి ఒకప్పుడు. ప్రస్తుతం ఆ పరిస్థితి కాస్తా తిరగబడింది. విద్యాధికులైన ఈ నంస్కారవంతుల్లోనే కులమతాలు ఊడలు నాటుకుని కరాళ నృత్యం చేస్తున్నాయి.

ఓట్ల రాజకీయాల దుర్మార్గపు ఎత్తుగడల్ని నిజ జీవితంలోకి ప్రతిఫలింపజేసుకునే వివేక శూన్యత్వంతో నా మిత్రుల హృదయాలు పట్టిపోతున్నాయి. నాకు అపరిచితమైన ఏవేవో వికృతాకారాలు ధరిస్తున్నారు. కాసేపటికి ఆ మురికంతా వాళ్ల వాళ్ల వ్యక్తిగత స్నేహ నంబంధాల్లోకి ఇంకి కంపుకొట్టించడం ప్రారంభించింది.

"చూడరా! నా దగ్గర ఇన్సూరెన్సు చేయకుండా వాళ్ల కొలీగ్ దగ్గర చేసినాడు శర్మ!" అంటూ కృష్ణమూర్తి.

"ఈ కృష్ణమూర్తి చూడరా! చీటీ ఎత్తుకుని డబ్బు కట్టకుండా ఉన్నాడు" అంటూ హుస్సేన్.

"ఈ హుస్సేను చూసి చూసి పది పైసలు ఖర్చు పెట్టడు. ఉత్త బంక - నా కొడుకు" అంటూ శర్మ.

మాటా మాటా పెరిగింది. అరచుకున్నారు. తిట్టుకున్నారు.

ఒక ఇద్దరేమో కలబడ్డారు. ఎంగిలి ప్లేట్ల మీద పడి పొర్లాడారు. కొట్టుకున్నారు.


అసహ్యం వేసింది.

ఒక గడ్డ మీద పుట్టిన వాళ్లు. ఒక ఊరి నీళ్లు తాగిన వాళ్లు. కష్టమూ, సుఖమూ చెప్పుకున్నవాళ్లు. ఒకరి కొకరు బాసటగా ఉంటామని ప్రతిజ్ఞలు చేసిన వాళ్లు.

ఊరికి దూరంగా ఒక ఆశ్రమంలాంటిది కట్టుకుని అంతా ఒకచోట సమష్టిగా, కళాత్మకంగా బతకాలని కలలుగన్న భావుకులు! ఆ ఉత్సాహాలూ, భావోద్వేగాలూ ఈ నా దేమయ్యాయి?

చిన్నప్పుడు ట్యూషన్‌కు పోయి చీకట్లో తిరిగి వస్తూ, ఒకరి చేయి ఒకరు ఆసరాగా పట్టుకుని ఇళ్లకు చేరిన పసివాళ్లు! ఆ ఆపేక్షలూ,

● వచ్చే వారం: ప్రత్యేక ఎంపిక కథ బలభద్రపాత్రుని ఉదయశంకర్ రచన 'అంతశ్శత్రువులు'




ఆత్మీయతా మాధుర్యాలూ ఈనాడు ఎక్కడికి పోయాయి?

స్నేహితులూ, అన్నా తమ్ముడూ, అక్కా చెల్లెలూ, వగైరా అన్ని మానవ సంబంధాల్నీ కాల ప్రవాహం నిర్దయగా కోసివేస్తుంటే, ఆత్మ లోతుల్లోకి నాటుకోలేని వేర్లు వికృతంగా బైటపడి పైన వటారంలా తేలిపోతున్నాయి.

మార్పుల్ని చూసి చలించాను, కంపించాను, దుఃఖ పడ్డాను, సంతోషపడ్డాను; ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను.

**ఎక్కడ? ఈ మార్పులకు ఆధార మెక్కడ? ఈ చలనాలకు ఇరుసు ఎక్కడ??**

అమ్మ పనిపోగానే నా బరువు బాధ్యతలు మీద వేసుకోవలసి వస్తుందని భయపడి ముఖం చాటేసిన మామయ్య - ఈ రోజు నేను నాలుగు




డబ్బులు సంపాదించుకుని ఉండడం చూసి, 'కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేస్తాను. ఇంటికిరా' అని పిలుస్తున్నాడు.

ఎప్పుడు ఎవరు ఏ విధంగా మారిపోతారో తెలియని ఈ మార్పుల ప్రపంచంలో వివాహం పేరిట ఒక మనిషితో శాశ్వత సంబంధాన్ని కోరుకోవడం ఎంత చిత్రాతి చిత్రం!

ఊరు విడిచి పెట్టేముందు ఒకసారి ఒంటరిగా కొండ వైపు వెళ్ళి రావాలనిపించింది.

సాయంత్రం చీకట్లు చిక్కబడుతున్నాయి. కొండకు ఆనుకుని ఉన్న సమాధుల మధ్య కాలి బాట మీదుగా నడుస్తున్నాను.

ఎప్పటికప్పుడు కొత్తగా మారిపోతున్న అవసరాల్తో, విలువల్తో, వేగంతో ఒక మహా ప్రవాహంలా సుడి తిరుగుతున్న పల్లెలూ, పేటలూ మధ్య నిశ్చలంగా నిలబడి ఉంది కొండ!

చంద్రుడింకా రాలేదు. ఆకాశంలో నక్షత్రాలు బలంగా మెరుస్తూ కొండ శిఖరంతో మిణుక్కు మిణుక్కుమంటూ గుసగుసలాడుతున్నాయి.

మా ఊరితోపాటు మా ఊరి శ్మశాన వాటిక కూడా విస్తరించి ఉండడం గమనించాను. ఊళ్లోని జనం బొట్టు వెంట బొట్టుగా ప్రవహించి శ్మశానంలోకి ఇంకిపోతూనే ఉన్నారు.

**గోరీలు! లయకారుని రంగ భూమి గోరీలు! మెల్లగా అడుగులు వేస్తున్నాను. వేసే అడుగులో సృష్టి. తీసే అడుగులో లయం. ఈ రెండింటి మధ్యా స్థితి! క్షణం గడిస్తే అది మాయ!! ప్రతి కదలికా మార్పు! మార్పే మృత్యువు. జీవితంలో తారసపడే అనుక్షణ మృత్యువు మార్పు! నశ్వరత్వం నాట్యం చేస్తుంటే మట్టికి హత్తుకుపోతున్న పాదాల ముద్రలు సమాధులు!!**

చప్పున ఆగిపోయాను. ఎవరిదో ఒక కొత్త సమాధి!. సమాధికి రెండు వైపులా గూళ్లల్లో వెలుగుతున్న దీపాలు చిరుగాలికి రెపరెపమంటున్నాయి. ఆ చలించే వెలుతుర్లో సత్యం మనిషి జీవితంతో పరాచికా లాడుతున్నట్లుంది. చేతులెత్తి నమస్కరిస్తూ నిలబడ్డాను. నవ్వేనా పెదవులపైకి అలలు అలలుగా ఉరుకుతూ వస్తోంది. నేను నమస్కరిస్తున్నది కొండకో, గోరీకో, అసలు నేను నాకే నమస్కరిస్తున్నానో... యోచిస్తే అది ఒక జవాబు లేని ప్రశ్న. అనుభవం ప్రశ్నలకు అందని జవాబు.

నా తల్లీ, తండ్రి తాతల సమాధుల్ని వెతకాలనే ఆసక్తి నశించి మెల్లగా నడిచిపోతున్నాను. హృదయంలో ఒక అవ్యాజ ప్రేమ నాట్యమాడుతుంటే, దానికి భౌతిక పరిధులు కల్పించే చిహ్నాలతో పని ఏమిటి?

మార్పుల ప్రవాహానికి చలించడంలో అర్థమేముంది? నేను మాత్రం మారలేదా? నా మార్పులతో నేను మమేకమై పోయి వికారాలకు లోను కావడం లేదా? నేను ఆ మార్పుల ప్రవాహంలోనే కొట్టుకుపోతూ, మళ్ళీ అదే ప్రవాహంలో నా స్నేహాలకూ, సౌకర్యాలకూ సంబంధించి మాత్రం ఒక స్థిరత్వాన్నీ శాశ్వతత్వాన్నీ వెదకజూస్తాను. ఎంత అసంబద్ధమైన విషయం!

చంద్రుడొచ్చాడు. ఏదో ధ్యానంలో మునిగి ఉన్నట్టు నిశ్చలంగా వెలుగుతోంది కొండ.

వేల సంవత్సరాలుగా - కొండ మీద గడ్డి మొక్కలు పుట్టి పెరిగి రాలిపోతున్నాయి. మహా వృక్షాలు కాలం చెల్లి చచ్చిపోతున్నాయి. కానీ కొండ అట్లే ఉంది.

తరతరాలుగా - పక్షులూ, జంతువులూ, కీటకాలూ కొండనే ఆశ్రయించుకుని పుడుతూ చస్తూ పరిభ్రమిస్తున్నాయి. కానీ కొండ అట్లే ఉంది.

ఎండుగడ్డీ, తుప్పలూ వేసవి సెగలకు రాజుకుని, ఒళ్లంతా దగ్ధమౌతున్నా సరే - కొండ అట్లే ఉంటుంది. తాను తానుగానే భాసిస్తూ ఉంటుంది.

ఇరుసు తిరగదు. కొండ చలించదు.

కొండ వైపే చూస్తున్నాను - నా లోపలా, బైటా ఎన్ని మార్పులూ, పరిణామాలూ సంభవించినా, అవేవీ కలత పెట్టని ఏదో గూఢ కాంతీ, గాంభీర్యమూ నన్ను ఆవహించాయి.

బాల్యంలో నేను చిన్న పిల్లవాణ్ణి అనుకున్నాను. యవ్వనంలో నేను యువకుణ్ణి అనుకున్నాను. ముసలితనంలో ముసలితనాన్ని అనుకుంటాను. ఇన్ని మార్పుల్లో ఏది నేను? ఏది కాదు?? వాస్తవానికి నేను ఏ మార్పునూ కానేమో! అన్ని మార్పుల్నీ అనుభవిస్తున్న ఒక ఉనికి మాత్రమేనేమో!

కాలిబాట మీద మడుగుకట్టిన వెన్నెల్లో అడుగులు వేస్తూ ఇంటి దారి పట్టాను. ఒకసారి వెనక్కు తిరిగి చూస్తే - సమాధుల పక్కనున్న కొండ చావు కూడా అంటనంత నిర్లిప్తంగా కనిపించింది.

ఆ కొండ నేనే!

నేను పీలుస్తూ విడిచే నా ఊపిరి కూడా అంటనంత తటస్థంగా ఆ కొండ నా లోపలే ఉంది.

మరునాడు ఉదయమే బస్సెక్కాను. అంత తెల్లవారుజామున చలిలో హుస్సేన్ మాత్రమే రాగలిగాడు బస్టాండ్‌కు. గడ్డమూ, కట్ మీసాల నడుమ నవ్వు మెరుస్తుండగా చెయ్యి ఊపి వీడ్కోలిచ్చాడు.

బస్సు కదిలింది. సన్నివేశం మారింది. మార్పు జీవితం కావచ్చు. కానీ జీవితానికంతా పరమార్థం కాలేదు.

నేను తిరిగిన వీధులూ, చదువుకున్న కాలేజీ, ఆడుకున్న ప్లే గ్రౌండూ - అన్నీ కనుమరుగైపోతుంటే - ఈ ఊరికి నేను మళ్ళీ ఎప్పుడొస్తానో? ఇక ఎప్పటికీ రాకపోయినా ఆశ్చర్యం లేదేమో అనిపించింది.

నాకు ఈ ఊరితో ఉన్నది సజీవ సంబంధం కాదు, ఉత్త జ్ఞాపకాల సంబంధమే! ఆ మాటకు వస్తే ఇన్నాళ్లూ నేను నాతో కలిగి ఉన్న సంబంధం కూడా జ్ఞాపకాల సంబంధమే! ఈ జ్ఞాపకాలు మంచు తెరల్లా విడిపోతే కొండను మరింత స్పష్టంగా చూడగలను అనుకుంటాను.

ఊరు వెనకపడింది.

కానీ కొండ నాతో పాటు వస్తూనే ఉంది ●